కేంద్ర బడ్జెట్‌లో తీవ్ర అన్యాయం



సత్యం శ్రీరంగం

కూకట్‌పల్లి: కేంద్ర ఆర్థిక మంత్రి ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో తెలంగాణకు ఇచ్చింది గుండు సున్నా అని, ఏపీ విభజన హామీలకు కట్టుబడి ఉన్నామన్న కేంద్రం తెలంగాణ విభజన హామీల సంగతేంటని టీపీసీసీ అధికార ప్రతినిధి డా. సత్యం శ్రీరంగం ప్రశ్నించారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ.. కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణ హామీల ప్రస్తావన లేకపోవటం బాధాకరమని, బడ్జెట్ కేటాయింపుల్లో రాష్ట్రానికి తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. తెలంగాణ బీజేపీ ఎంపీలు ప్రజలకు సమాధానం చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. రాష్ట్రం నుంచి ఎనిమిది మంది బీజేపీ ఎంపీలు, ఇద్దరు కేంద్ర మంత్రులున్నా రాష్ట్రానికి చేసిందేమీ లేదని ఎద్దేవా చేశారు.

మొక్కలు నాటి సంరక్షించాలి

మోతీనగర్: పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని లయన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ పర్యావరణ పరిరక్షణ కమిటీ చైర్మన్ లయన్ అన్నెం కోటిరెడ్డి అన్నారు. మంగళవారం ప్రసూన్ నగర్ పార్కులో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పర్యావరణాన్ని మనం కాపాడితే అది మనల్ని కాపాడుతుందని అన్నారు. ప్రతి ఒక్కరూ తమ ఇంటిముందు మొక్కలు నాటాలని కోరారు. కార్యక్రమంలో నాగేశ్వరరావు, సత్యనారాయణ రెడ్డి, గోపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి కృషి చేయాలి



ఎమ్మెల్యే గాంధీని సన్మానిస్తున్న మాజీ కార్పొరేటర్ తదితరులు

ఆల్విన్‌కాలనీ: కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేయడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ అన్నారు. మంగళవారం హైదర్‌నగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ జానకి రామరాజు ఎమ్మెల్యేను కలిసి సన్మానించారు. కార్యక్రమంలో బోస్‌రెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి, ఎస్‌వీఎస్ రాజు, రాంమోహన్, రాజు, రాములు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినులకు అవగాహన



అవగాహన కల్పిస్తున్న డాక్టర్ హరిత

కూకట్‌పల్లి: వివేకానందనగర్‌లోని ప్రగతి మహిళా జూనియర్ కళాశాలలో మంగళవారం డాక్టర్ హరిత ఎంబీబీఎస్, డీజీఓ విద్యార్థులకు ఋతు సమస్యలపై అవగాహన సదస్సు నిర్వహించారు. పౌష్టికాహారం, శారీరక, మానసిక దృఢత్వం, నెలసరి సమయంలో వచ్చే సమస్యలపై విద్యార్థినుల సందేహాలను డాక్టర్ హరిత నివృత్తి చేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ హిమబిందు, అధ్యాపకులు, ఫార్మా సిబ్బంది పాల్గొన్నారు.

న్యూఎరా పాఠశాలలో బోనాల సందడి



ఆల్విన్‌కాలనీ: వివేకానందనగర్ కాలనీలోని న్యూ ఎరా పాఠశాలలో మంగళవారం బోనాల పండుగ అంగరంగ వైభవంగా జరిగింది. ఉదయం 9 గంటలకు అమ్మవారికి బోనం ఎత్తుకుని ఉపాధ్యాయులు చిత్తారమ్మ గుడికి వెళ్లి బోనం సమర్పించారు. అనంతరం 4, 5 తరగతి విద్యార్థులు నృత్య ప్రదర్శనలతో భక్తి పారవశ్యంలో ముంచెత్తారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ వేణుగోపాల్ రెడ్డి, అకాడమిక్ ఇన్‌చార్జి అపర్ణ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సమాన వేతనమివ్వాలి



బండి రమేష్‌కు వినతిపత్రం అందజేస్తున్న ప్రతినిధులు

బాలానగర్: జీహెచ్‌ఎంసీలో రిసోర్స్ పర్సన్స్‌కు ఇస్తున్న మాదిరిగా తమకు కూడా సమాన వేతనం ఇవ్వాలని కూకట్‌పల్లి మహిళా పొదుపు సంఘాల ప్రతినిధులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం బాలానగర్‌లోని కార్యాలయంలో కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి బండి రమేష్‌ను కలిసి వినతిపత్రం అందించారు. తాము ఇరవై సంవత్సరాలుగా పొదుపు సంఘాలను నడిపిస్తున్నామని, ఎలాంటి వేతనం లేదన్నారు. మహిళా గ్రూపులు నడిపించటంలో తలెత్తుతున్న సమస్యలను వివరించారు.

ఎల్లమ్మతల్లికి ప్రత్యేక పూజలు



పూజలో పాల్గొన్న సునీల్ కుమార్‌యాదవ్ తదితరులు

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి మెట్రో, హుడా ట్రక్ పార్కింగ్ వద్ద ఆటో యూనియన్ ఏర్పాటు చేసిన రేణుకా ఎల్లమ్మతల్లి ఆలయంలో అమ్మవారి కల్యాణం మంగళవారం ఘనంగా జరిగింది. యూత్ కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు జిట్టా సునీల్ కుమార్ యాదవ్ పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు.

శివార్లపై డెంగీ పంజా

- రావల్‌కోల్‌లో డెంగీతో ఒకరిమృతి
- అదే స్థాయిలో టైఫాయిడ్ ఫీవర్ బాధితులు
- రెండు నెలల్లో 83 డెంగీ కేసులు
- శాఖల మధ్య కొరవడిన సమన్వయం
- ప్రజలకు తప్పని ఇబ్బందులు.

జిల్లాలో 162 డెంగీ కేసులు నమోదు



సాక్షి,సిటీబ్యూరో: నగర శివార్లపై డెంగీ పంజా విసురుతోంది. బస్తీలు ,పల్లెల్లో దోమల బెడదతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. జిల్లాలో ఇప్పటి వరకు 162 డెంగీ కేసులు నమోదు కాగా, టైఫాయిడ్, చికెన్ గున్యా, విష జ్వరాలకు సంబంధించిన కేసులు కూడా ఎక్కువగానే నమోదవుతున్నాయి. వర్షాల కారణంగా దోమలు విజృంభిస్తుండటంతో డెంగీ, టైఫాయిడ్ కేసులు పెరుగుతున్నట్లు అధికారులు పేర్కొంటున్నారు. మేడ్చల్ మండలం రావల్‌కోల్‌లో ఓ వ్యక్తి డెంగీతో బాధపడుతూ మృత్యువాత పడ్డాడు. శివారు బస్తీలు ,పల్లెల్లో బాధితులకు మెరుగైన వైద్య చికిత్సలు అందకపోవడంతో నగరంలోని ప్రైవేటు ఆసుపత్రులకు బారులు తీరుతున్నారు. ఏటా వర్షాకాలం ప్రారంభంలో పల్లె ప్రగతి పేరిట పారిశుద్ధ్య కార్యక్రమాలు నిర్వహించేవారు. ఈ ఏడాది పంచాయతీల్లో పాలకవర్గాలు లేకపోవడంతో వాటి నిర్వహణ అటకెక్కింది. ప్రత్యేకాధికారుల పాలన ఉన్నా పారిశుద్ధ్యం అధ్వానంగా మారడంతో దోమలు స్వైర విహారం చేస్తున్నాయి. దీంతో పల్లె ప్రజలు దోమకాటుకు గురవుతున్నారు. జిలాల్లో జూన్‌లో 30, జులైలో 53 డెంగీ కేసులు నమోదు కావటంతో ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

నిధుల మంజూరు లేదు..

మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో ఒక్కో ప్రత్యేకాధికారికి రెండు లేదా మూడు పంచాయతీల బాధ్యతలు అప్పగించారు. దీంతో వారు చుట్టపు చూపుగా గ్రామాలకు వస్తుండటంతో పంచాయతీల్లో పాలన అస్తవ్యస్తంగా మారి పారిశుద్ధ్యంపై పర్యవేక్షణ కొరవడింది. గత ఆరునెలలుగా పంచాయతీలకు నిధులు మంజూరు కాకపోవడంతో పారిశుద్ధ్య నిర్వహణ కార్యక్రమాలు పూర్తిగా నిలిచిపోయాయి. అడపాదడపా నిర్వహిస్తున్నారే తప్ప... మాస్ క్లీనింగ్ లేకుండా పోయింది.

కొరవడిన సమన్వయం..

జిల్లా అధికార యంత్రాంగం పంచాయతీరాజ్, వైద్యారోగ్యం, గ్రామీణాభివృద్ధి శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించినా... ఇందుకు విరుద్ధంగా శాఖల మధ్య సమన్వయం కొరవడి ఎవరికి వారే అన్న విధంగా వ్యవహరిస్తున్నారు. దీంతో పంచాయతీలు, బస్తీల్లో సమస్యలు పేరుకుపోయాయి.

అత్యధిక కేసులు ఇక్కడే..

మల్కాజిగిరి, ఉప్పల్, కుషాయిగూడ, నారపల్లి, బోడుప్పల్ , మేడ్చల్ జవహర్‌నగర్,బాలానగర్, కూకట్‌పల్లి, కుత్బుల్లాపూర్, అల్వాల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో అత్యధికంగా డెంగీ కేసులు నమోదయ్యాయి. వైరల్ ఫీవర్ వంటి రోగాలు ప్రబలు తుండటంతో ప్రజలు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇదే అదను ప్రైవేట్ ఆసుపత్రులు పరీక్షలు ,వైద్య సేవల పేరుతో అందినకాడికి దోచుకుంటున్నారు.

పత్తాలేని ఫాగింగ్..

జిల్లాలో మూసీ పరివాహక ప్రాంతాలైన మల్కాజిగిరి, ఉప్పల్, కుత్బుల్లాపూర్ మున్సిపల్ సర్కిళ్లలో బస్తీలతోపాటు బోడుప్పల్, పీర్జాదిగూడ, మేడ్చల్ మున్సిపల్ పట్టణాల్లో చెత్తాచెదారం పేరుకుపోవడంతో దోమలు స్వైర్వ విహారం చేస్తున్నా పట్టించుకునేవారు కరువయ్యారు. కనీసం ఫాగింగ్ చేయాలన్న ఊసే మరచిపోయారు. పురపాలికల్లో అభివృద్ధి పర్యవేక్షణ కమిషనర్లదే అయినా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. భవానీనగర్, చర్లపల్లి, మల్లాపూర్, నాచారం, జీడిమెట్ల ,కుషాయిగూడ, ఇసీఐఎల్, ఏఎస్‌రావు నగర్, నేరెడ్‌మెట్, మౌలాలి, బాలానగర్, గాజులరామారం తదితర శ్రామిక వాడల్లో కాలుష్యం కారణంగా ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టాలని, దోమల వ్యాప్తికి అడ్డుకట్ట వేయాలని ఆయా ప్రాంతాల ప్రజలు కోరుతున్నారు.

ఉన్నత శిఖరాలను అధిరోహించాలి



విద్యార్థులకు యూనిఫాం అందజేస్తున్న ఎమ్మెల్యే గాంధీ తదితరులు

ఆల్విన్‌కాలనీ: విద్యార్థులు బాగా చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని, గురువులకు పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలని శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ అన్నారు. మంగళవారం వివేకానందనగర్ డివిజన్, వెంకటేశ్వర నగర్‌లోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు యూనిఫాం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ఉచితంగా పాఠ్య పుస్తకాలు, రెండు జతల యూనిఫాంను ప్రభుత్వం అందజేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో నాయినేని చంద్రకాంత్‌రావు, హరినాథ్, లక్ష్మీ నరసయ్య, సత్యనారాయణ, శ్యామ్ రావు, చంద్రమోహన్, దుర్గ, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ స్థలాలను పరిశీలించిన జేసీ

కుత్బుల్లాపూర్: పేట్ బషీరాబాద్ సర్వే నెంబర్ 25/1, 25/2లలో ఉన్న ప్రభుత్వ భూములను జాయింట్ కలెక్టర్ విజయేందర్ రెడ్డి పరిశీలించారు. మంగళవారం రంగారెడ్డి బండ, యాదిరెడ్డి బండ ప్రాంతాల్లో ఇప్పటి వరకు జరిగిన నిర్మాణాలతో పాటు ఖాళీగా ఉన్న స్థలాలను పరిశీలించి, వాటి చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు.

షాపింగ్‌మాల్, మల్టీప్లెక్స్‌లో తనిఖీలు



ఆర్బిమ్ మాల్‌లో తనిఖీలు చేస్తున్న జీహెచ్‌ఎంసీ అధికారులు

గచ్చిబౌలి: గచ్చిబౌలిలోని షాపింగ్‌మాల్స్, మల్టీప్లెక్స్‌ను మంగళవారం జీహెచ్‌ఎంసీ శేరిలింగంపల్లి అధికారులు పరిశీలించారు. జీహెచ్‌ఎంసీ శేరిలింగంపల్లి సర్కిల్ డిప్యూటీ కమిషనర్ రజనీకాంత్‌రెడ్డి, ఏసీపీ మెప్మా సిబ్బందితో కలిసి తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా డీసీ మాట్లాడుతూ షాపింగ్‌మాల్స్, మల్టీప్లెక్స్‌లో పార్కింగ్ ఫీజువసూలు.. సౌకర్యాల కల్పనపై వినియోగదారులను అడిగి తెలుసుకున్నారు. మాల్స్, మల్టీప్లెక్స్‌లలో మొదటి అరగంట పార్కింగ్ ఉచితంగా కల్పించాలని, ఆ తర్వాత ఒక్కో గంట చొప్పున రుసుము వసూలు చేయవచ్చని సూచించారు. అరగంట మించి అక్కడ ఏదైనా వస్తువు కొనుగోలు చేసినట్లు బిల్లు చూపిస్తే వాహనం ఎంత సేపు ఉన్నా పార్కింగ్ ఫీజు వసూలు చేయకూడదని స్పష్టం చేశారు. నిబంధనలు ఖచ్చితంగా అమలు చేయాలని స్పష్టం చేశారు. ప్రభుత్వ ఆదేశాలు పాటించకపోతే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్యే కేటీఆర్‌తో కలిసి అసెంబ్లీ సమావేశాలకు వెళ్లిన కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు తదితరులు - కూకట్‌పల్లి

బాధ్యతగా మొక్కలు నాటి సంరక్షించాలి

కుత్బుల్లాపూర్: ప్రతి ఒక్కరూ బాధ్యతగా మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని ఎమ్మెల్యే వివేకానంద్ అన్నారు. మంగళవారం జీడిమెట్ల డివిజన్ ప్రసూన నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యాలయంలో తెలంగాణ జూనియర్ ఫారెస్ట్ ఆఫీసర్ల అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు, డిప్యూటీ ఫారెస్ట్‌రేంజ్ ఆఫీసర్ నాగేంద్రబాబు ఆధ్వర్యంలో జరిగిన వన మహోత్సవంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. కాలనీ వాసులు, సిద్ధార్థ పాఠశాల విద్యార్థులతో కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సకాలంలో వర్షాలు పడి భూగర్భ జలాలు వృద్ధి చెందాలన్నా, కాలుష్యం తగ్గాలన్నా మొక్కలు నాటాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు సంపత్, మాధవరెడ్డి, కుంట సిద్ధిరాములు, సుధాకర్ గౌడ్, జ్ఞానేశ్వర్, ఎల్లాగౌడ్, విజయ హరీష్, కాలె గణేష్, సంజీవ్, ప్రసూన నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు రాంచందర్, ప్రధాన కార్యదర్శి సిద్ధులు, అసోసియేషన్ సభ్యులు సాగర్ రెడ్డి, సుబ్బారావు, రమేష్, సత్యనారాయణ, నారాయణ, శంకర్ పాల్గొన్నారు.

సమస్యలపై స్పందించి పర్యటించిన జెడ్సీ



మాధవరం కాలనీ కల్వర్టు అప్రోచ్ రోడ్డును పరిశీలిస్తున్న జెడ్సీ, కార్పొరేటర్

ఆల్విన్‌కాలనీ: వివేకానందనగర్ డివిజన్‌లో కార్పొరేటర్ మాధవరం రోజాదేవితో కలిసి జోనల్ కమిషనర్ అపూర్వ చౌహాన్ మంగళవారం పర్యటించారు. ఇటీవలే జెడ్సీని కలిసి కార్పొరేటర్ పలు సమస్యలను వివరించారు. మాధవరం కాలనీ కల్వర్టు అప్రోచ్ రోడ్డు, వడ్డేపల్లి ఎన్‌క్లేవ్ వద్ద సెంట్రల్ మీడియంలో మొక్కలు నాటడం, సీసీ రోడ్లు, బోనాల సందర్భంగా చిత్తారమ్మ గుడిలో పనులు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. దీనబంధు కాలనీ వంతెన, ఈనాడు కాలనీ, వివేకానందనగర్ కాలనీలో పర్యటించారు. రోడ్డు పనులను పరిశీలించారు. కాంట్రాక్టర్‌తో మాట్లాడి త్వరగా చేపట్టాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ అన్ని శాఖల అధికారులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నోట్‌బుక్స్ అందజేత



విద్యార్థులకు నోటు బుక్స్ అందజేస్తున్న హెచ్ఎంతో పాస్టర్ జాన్ ఫ్రాన్సిస్ తదితరులు

మోతీనగర్: అల్లాపూర్ డివిజన్ పరిధి వి. రామారావు నగర్‌కు చెందిన గ్రేస్ టబర్నికల్ చర్చి సేవా సంస్థ ఆధ్వర్యంలో స్థానిక మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు స్టేషనరీ వస్తువులను మంగళవారం అందజేశారు. నోట్ బుక్స్, పలకలు, పెన్సిళ్లు, పెన్నులు, వాటర్ బాటిళ్లను దాత పాస్టర్ జాన్ ఫ్రాన్సిస్‌తో కలిసి బీఆర్‌ఎస్ బీసీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు నాగుల సత్యం 56 మంది విద్యార్థులకు అందజేశారు. ఈ సందర్భంగా నాగుల సత్యం మాట్లాడుతూ.. 15 సంవత్సరాల నుంచి విద్యా సంవత్సరం ప్రారంభంలోనే విద్యార్థులకు నోట్ బుక్స్, ఇతర వస్తువులను అందజేస్తున్నామని గుర్తు చేశారు. విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించాలని కోరారు. కార్యక్రమంలో సంక్షేమ సంఘం అధ్యక్షుడు బి. వెంకట్‌యాదవ్, నాయకులు సుభాష్‌రెడ్డి, సాంబశివ, హెచ్‌ఎం ప్రసన్న, ఉపాధ్యాయులు హయగ్రీవాచారి తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని ఎమ్మెల్యేకు వినతి



ఎమ్మెల్యే గాంధీకి వినతిపత్రం అందజేస్తున్న కాలనీ వాసులు

ఆల్విన్‌కాలనీ: హైదర్‌నగర్ డివిజన్ హెచ్‌ఎంటీ హిల్స్ శాతవాహన నగర్ కాలనీ వాసులు కాలనీ సమస్యలు, అభివృద్ధి పనులపై మంగళవారం శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీని కలిసి వినతిపత్రం అందజేశారు. వివిధ సమస్యలపై ఎమ్మెల్యేతో కాలనీ వాసులు చర్చించారు. అనంతరం ఎమ్మెల్యే గాంధీ సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి సమస్యలను త్వరగా పరిష్కరించి ప్రజలకు ఇబ్బంది లేకుండా చూడాలని ఆదేశించారు. కాలనీలో అసంపూర్తిగా మిగిలిపోయిన సీసీ రోడ్డు, యూజీడీ పనులను త్వరలో పూర్తి చేస్తామన్నారు. కార్యక్రమంలో కాలనీ వాసులు అందె నర్సింహ, శ్రీనివాస రావు, సీతారాముడు, యాదిరెడ్డి, మదన్‌మోహన్, వెంకట్రామిరెడ్డి, బాబురావు, సత్యనారాయణ, రామనాథం, ప్రకాష్, శంకర్‌రావు తదితరులు పాల్గొన్నారు.